'బీజేపీ గెలుపుకోసం కృషిచేయాలి'



సమావేశంలో పాల్గొన్న కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ తదితరులు

కవాడిగూడ: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ గెలుపుకోసం ప్రతీ ఎస్సీ మోర్చా నాయకులు కార్యకర్తలు పాటుపడాలని కవాడిగూడ కార్పొరేటర్ జి. రచనశ్రీ, ముషీరాబాద్ నియోజకవర్గం బీజేపీ కన్వీనర్ ఎం. రమేష్‌రాం పిలుపునిచ్చారు. ఆదివారం కవాడిగూడ డివిజన్‌లోని తాళ్లబస్తీలో ఉన్న స్థానిక కార్పొరేటర్ జి. రచనశ్రీ నివాసంలో ముషీరాబాద్ నియోజకవర్గం ఎస్సీ మోర్చా కన్వీనర్ పి. పరుశురాం, జిల్లా ఉపాధ్యక్షుడు ఇరుగు కృష్ణ ఆధ్వర్యంలో ఎస్సీ మోర్చా నాయకులు కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ... గత పది సంవత్సరాల్లో దేశ ప్రధాని, బీజేపీ హాయంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికి వివరిస్తూ రాబోయేపార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి గెలుపుకోసం పాటుపడాలని వారు పిలుపునిచ్చారు. కాంగ్రెస్, బీఆర్ఎస్‌లు ఎన్నిజిమ్మిక్కులు చేసినా కేంద్రంలో మూడోసారి బీజేపీ అధికారంలోకి రావడాన్ని ఎవరూ అడ్డుకోలేరని వారు పేర్కొన్నారు.

మహిళల హక్కుల కోసం పోరాడిన వీరవనిత మోటూరు ఉదయం



మోటూరు ఉదయంకు నివాళులు అర్పిస్తున్న ఎస్.పుణ్యవతి తదితరులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మహిళల హక్కుల సాధన కోసం అలుపెరుగని పోరాటం చేసిన యోధురాలు మోటూరు ఉదయం అని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్.పుణ్యవతి అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలోని ఐద్వా రాష్ట్ర కార్యాలయంలో మోటూరు ఉదయం 22వ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఎస్.పుణ్యవతి మాట్లాడుతూ రెండవ ప్రపంచ యుద్ధం సందర్భంగా హిట్లర్‌కు వ్యతిరేకంగా బుర్రకథ బృందాన్ని తయారు చేసి తెలుగు రాష్ట్రాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారని గుర్తు చేశారు. 26 సంవత్సరాల పాటు మహిళా హక్కుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అరుణజ్యోతి, ఉపాధ్యక్షులు కె.ఎస్.ఆశలత, బి.అనురాధా, సత్తమ్మ, స్వరాజ్యం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్ వేడుకలు



రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందిస్తున్న పాస్టర్ శ్యామ్ అబ్రహం

ముషీరాబాద్: ఈస్టర్ పర్వదినం సందర్భంగా ముషీరాబాద్‌లోని చర్చిలలో ఆదివారం సందడి వాతావరణం నెలకొంది. క్రైస్తవులు తెల్లవారుజామున 5 గంటలకే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. యేసు ప్రభు భక్తి గీతాలను ఆలపిస్తు ఈస్టర్ పండుగను జరుపుకున్నారు. ముషీరాబాద్ డివిజన్‌లోని రాంనగర్ ప్రేయర్ పవర్ చర్చిలో పాస్టర్ శ్యామ్ అబ్రహం బైబిల్‌లోని దైవ సందేశాన్ని అందించారు. యేసు ప్రభు బోధనలు అనుసరిస్తూ కష్టాలలో ఉన్న వారిని ఆదుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా యేసుప్రభు భక్తిగీతాలను ఆలపించారు. కార్యక్రమంలో ప్రేయర్‌పవర్ చర్చి కన్వీనర్ బ్రణహం, అడాసా, చర్చి ప్రతినిధులు పాల్గొన్నారు. ఈస్టర్ పండుగ సందర్భంగా చర్చిలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

పేద విద్యార్థులకు ఉన్నత విద్యను అందిస్తున్నాం



విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: పేద విద్యార్థులకు ఉన్నతమైన విద్యను అందించడానికి తమవంతుగా కృషి చేస్తున్నామని మైత్రి విద్యానికేతన్ హైస్కూల్ కరెస్పాండెంట్ మహేష్ అన్నారు. అటువంటి గొప్ప లక్ష్యంతో మా విద్యా సంస్థలను స్థాపించామని తెలిపారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మైత్రి విద్యానికేతన్ హై స్కూల్ 24వ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు తమ ఆటపాటలతో ఆకట్టుకున్నారు. అనంతరం కరస్పాండెంట్ మహేష్ మాట్లాడుతూ పేదలకు అతి తక్కువ ఫీజుతో మంచి విద్యను అందిస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ సౌమ్య, ఉపాధ్యాయులు రాణి, వరలక్ష్మి, అమీర్, రాజేశ్వరి, సుప్రియ, శ్రీకాంత్, భాస్కర్‌రెడ్డి, చంద్రశేఖర్, రాజశేఖర్‌రెడ్డి, రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలోకి ఎమ్మెల్యే రావడాన్ని వ్యతిరేకిస్తాం



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ సీనియర్ నాయకులు

అంబర్‌పేట: అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ కాంగ్రెస్ పార్టీలోకి రావడాన్ని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు తెలిపారు.

ఆదివారం డీడీ కాలనీలోని వి.హన్మంతరావు నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు గరిగంటి రమేష్, దిడ్డి రాంబాబు, పులి జగన్, శంభుల శ్రీకాంత్ గౌడ్, యాసీన్ షరీఫ్‌లు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీలో కాలేరు వెంకటేష్ చేరాలనుకుంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి చేరాలని వారు సవాలు చేశారు.

ముగిసిన మహిళా దినోత్సవ వేడుకలు



రాంగోపాల్‌పేట: వెస్ట్ మారేడుపల్లి గీతాంజలి స్కూల్ ఆధ్వర్యంలో నెల రోజుల పాటు నిర్వహించిన మహిళాదినోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. సికింద్రాబాద్ ప్యాట్నీ సెంటర్‌లోని హరిహర కళాభవన్‌లో ఆదివారం జరిగిన ముగింపు సమావేశంలో వివిధ రంగాల్లో ప్రముఖులైన మహిళలను ఘనంగా సత్కరించారు. నిజాంపేట్ మేయర్ నీలా గోపాల్‌రెడ్డి, సోషల్ యాక్టివిస్ ఇందుకూరి నిర్మలాదేవి, అలీప్ ఫౌండర్ ప్రెసిడెంట్ రమాదేవి, కార్పొరేటర్ కొంతం దీపిక, సర్వశిక్ష అభియాన్ మానిటరింగ్ హెడ్ డాక్టర్ కే.బాలకుమారి, ప్రముఖ ల్యాప్రోస్కోపిక్, కొలరెక్టర్ సర్జన్ డాక్టర్ శాంతి వర్ధని, క్లినికల్ సైకాలజిస్ట్ మాధవి, సోషల్ యాక్టివిస్ట్ మంజులత, సైంటిస్ట్ శీల శ్రీసుధ, చార్టెడ్ అకౌంటెంట్ స్వప్న ప్రియ, యోగా ఎక్స్‌పర్ట్ ప్రసన్న, కూచిపూడి నృత్య కళాకారిణి మృణాలిని తదితరులను ఘనంగా సత్కరించారు. పాఠశాల వ్యవస్థాపక చైర్మన్ శ్రీనివాసరావు, అకడమిక్ డైరెక్టర్ వేధకుమారిలు మాట్లాడుతూ.. వివిధ రంగాల్లో మహిళలు సాధించిన విజయాలను విద్యార్థులకు తెలియచేసేలా నెల రోజుల పాటు ప్రతిరోజూ ఒక ప్రముఖ మహిళల చేత విద్యార్థులకు మోటివేషనల్ స్పీచ్‌లు అందించినట్లు చెప్పారు. ముగింపు సందర్భంగా మహిళా దినోత్సవాన్ని గొప్ప వేడుకగా నిర్వహించడంతో పాటు ప్రముఖులను సత్కరించి విద్యార్థులు ఉన్నత శిఖరాలు చేరుకునేలా ప్రోత్సహిస్తున్నామని వివరించారు. విద్యార్థుల నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఓయూలో విదేశీ విద్యార్థుల ప్రవేశాలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో విదేశాల విద్యార్థుల ప్రవేశాలకు ప్రకటన విడుదల చేశారు. యూనివర్సిటీ క్యాంపస్‌తో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల్లో 2024-25 విద్యా సంవత్సరానికి డిగ్రీ, పీజీతో పాటు ఇతర కోర్సుల్లో ప్రవేశాలకు అధికారులు ప్రకటన జారీ చేశారు. పూర్తి వివరాలకు Osmania.ac.inను చూడొచ్చు.

రెచ్చిపోతున్న అల్లరి మూకలు

- అర్ధరాత్రి దాటినా రోడ్లపైనే తిష్ట
- ఇదేమని అడిగితే బెదిరింపులు, దాడులు
- చోద్యం చూస్తున్న పోలీసులు



ముషీరాబాద్: ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాంనగర్ మీ సేవా కేంద్రం సమీపంలో గల మెడి బావి బస్తీ, ఫాతిమా మసీదు, శ్రీనివాస సారీ సెంటర్ సమీపంలోని వాటర్ ట్యాంక్ పరిసర ప్రాంతాల్లో అల్లరి మూకలు రెచ్చిపోతున్నాయి. అర్ధరాత్రి దాటిన ద్విచక్ర వాహనాలపై తిరుగుతూ కేకలు, ఈలలు వేస్తూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. ఇక అరుగులపై కూర్చొని అర్ధరాత్రి దాటిన తరువాత కూడా ఫోన్‌లలో గేమ్స్ ఆడుతూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కొన్ని సందర్భాలలో వారి మధ్య ఏర్పడిన వివాదాలతో ఒకరిపై ఒకరు దాడులు చేసుకుంటున్నారు. ఇదేమని అడిగిన స్థానికులతో వాగ్వివాదానికి దిగడం, బెదిరింపులకు పాల్పడుతుండడంతో మాకేందుకులే అని అనేక మంది సైలెంట్ అయిపోతున్నారు. ఇటీవల పది రోజుల కాలంలో రెండు ఘర్షణలు చోటు చేసుకోవడం తాజా పరిస్థితికి అద్దం పడుతోంది. ముఖ్యంగా రెండు రోజుల క్రితం ఇరువర్గాలకు చెందిన వారు ఘర్షణ పడుతున్న ఓ వీడియో నగర వ్యాప్తంగా సంచలనం సృష్టించింది. అయినప్పటికి పోలీసులు ఎలాంటి బందోబస్తు ఏర్పాటు చేయకపోవడం, రాత్రి పూట గస్తీ తిరిగే పోలీసులు సైతం చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో అల్లరి మూకలకు అడ్డుఅదుపు లేకుండాపోతుంది.

- ముంబయ్, షోలాపూర్, పూణె తదితర ప్రాంతాల నుంచి సెకండ్ హ్యాండ్ డీసీఎం వ్యాన్‌లు తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తుంటారు. ఈ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ పార్కు చేయడంతో స్థానికులు పలుమార్లు అభ్యంతరం వ్యక్తం చేసినప్పటికి పట్టించుకునే నాధులే లేకపోవడంతో స్థానికులకు మేడిబావి బస్తీకి చెందిన ఈ వ్యాపారులకు పలుమార్లు వాగ్వివాదాలు చోటు చేసుకున్నాయి.

అన్యాయంగా దాడి చేశారు : మహ్మద్ అక్బర్.

ఓనర్ కమ్ డ్రైవర్‌ను అయిన తాను క్యాటరింగ్ చేసే మహ్మద్ అక్తర్‌కు 2021 నుంచి తన వాహనాన్ని కిరాయికి పెడుతున్నానని అప్పటి నుంచి ఇప్పటి వరకు తనకు సుమారు 50 వేల రూపాయలు వ్యాల్సి ఉందని ఆదివారం రాంనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహ్మద్ అక్బర్ తెలిపారు. ఎప్పుడు అడిగినా వాయిదా వేస్తున్నాడని రెండు రోజుల క్రితం ఈ డబ్బు విషయాన్ని గట్టిగా నిలదీసి అడగగా అక్తర్ అనుచరులు, అతడి బంధువులు సిద్ధిఖ్, ఏజాజ్, చోటూ, షెరోజ్‌లతో పాటు మరో పది మంది 70 సంవత్సరాల వృద్ధుడునని కూడా చూడకుండా విపరీతంగా దాడి చేశారని తెలిపారు. బస్తీలో వీరి ఆగడాలు రోజు రోజుకు మితిమీరిపోతున్నాయని వీరిపై పోలీసులు కఠినంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

4 చిల్లీస్ హోటల్‌కు గొడవకు సంబంధం లేదు...

4 చిల్లీస్ హోటల్ వద్ద హలీం తిన్న కస్టమర్‌కు, హోటల్ యాజమాన్యానికి మధ్య డబ్బు చెల్లింపు విషయంలో ఘర్షణ జరిగినట్లు, కస్టమర్‌ను హోటల్ యాజమాన్యం విపరీతంగా కోట్టినట్లు జరుగుతున్న ప్రచారంలో వాస్తవం లేదని హోటల్ యజమాని మహ్మద్ జహంగీర్ తెలిపారు. మెడిబావి బస్తీకి చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య డబ్బు చెల్లింపు విషయం జరిగిన ఘర్షణ అని వారు బస్తీ నుంచి కోట్టుకుంటూ మా హోటల్ వద్దకు వచ్చారని అంతేతప్ప తమ హోటల్‌కు గొడవకు ఎలాంటి సంబంధం లేదని మహ్మద్ జహంగీర్ తెలిపారు.

మోదీ, అమిత్‌షాలపై ఈడీ ఎందుకు చర్యలు తీసుకోదు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: దేశంలో ఆర్థిక నేరాలకు పాల్పడుతున్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షాలపై ఈడీ ఎందుకు చర్యలు తీసుకోదని టీపీసీసీ అధికార ప్రతినిధి గౌరీ సతీష్ ప్రశ్నించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భారతదేశంలోని అత్యున్నత న్యాయస్థానం కల్పించుకొని ఎస్‌బీఐను ఆదేశించడం అంటే బ్యాంక్ చేసిన ఆర్థిక వ్యవహారాలు ఎంత మొత్తం నడిచాయో అర్థం అవుతుందన్నారు. విదేశాల్లో దాగి ఉన్న నల్లధనాన్ని తీసుకువచ్చి అందరి ఖాతాల్లో వేస్తానని ప్రగల్బాలు పలికిన మోదీ ఆ పని ఎందుకు చేయలేదని విమర్శించారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి నూకలు చెల్లాయని ఆయన జోష్యం చెప్పారు. బీజేపీ పాలనకు చరమగీతం పాడాలని ఆయన పిలుపునిచ్చారు.

'కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్‌కు లేదు'

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: మాజీ ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరిని విమర్శించే నైతిక హక్కు బీఆర్ఎస్ నాయకులకు లేదని టీఎంపీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు గారె వెంకటేష్ మాదిగ విమర్శించారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎలాంటి అవినీతి, మచ్చలేని నాయకుడిగా ఎదిగిన కడియం శ్రీహరిని విమర్శించడాన్ని సహించబోమన్నారు. కడియం శ్రీహరి ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, భూకబ్జాలు చేయలేదని, ఎవరి ఆస్తులూ దోచుకోలేదని అన్నారు.

వీహెచ్‌పీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా తోట జస్వంత్



కాచిగూడ: విశ్వ హిందూ పరిషత్ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్‌గా న్యాయవాది తోట జస్వంత్ నియమితులయ్యారు. జస్వంత్ తెలంగాణ రాష్ట్ర హైకోర్టులో, రంగారెడ్డి జిల్లా కోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. తోట జస్వంత్ భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించాలని తెలంగాణ మున్నూరుకాపు న్యాయవాదుల సంఘం గౌరవ అధ్యక్షుడు గున్నాల ప్రకాష్ రావు, అధ్యక్షుడు సిరికొండ సంజీవరావు, ప్రధాన కార్యదర్శి కొండూరు వినోద్ కుమార్‌లు ఆకాంక్షించారు.

మేడిబావి బస్తీలలో ఇఫ్తార్ విందు

ముషీరాబాద్: అడిక్‌మెట్ డివిజన్‌లోని మేడిబావి బస్తీలో స్థానిక బస్తీ పెద్దలు, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఎస్.శంకర్ ఆధ్వర్యంలో ఆదివారం ఇఫ్తార్ విందు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ యువజన కమిటీ సీనియర్ నాయకుడు ముఠా జైసింహ ముస్లింలతో కలిసి సామూహిక ప్రార్థనలు నిర్వహించి అనంతరం ఇఫ్తార్ విందును ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కనకరాజు, గురుదీప్‌సింగ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

కాచిగూడ: రైలు కిందపడి గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సమ్మయ్య తెలిపిన మేరకు.. సీతాఫల్‌మండి రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. మృతదేహాన్ని రైల్వే పోలీసులు స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురికి తరలించారు. రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భక్తి పరిపూర్ణమైతేనే జ్ఞానమార్గాన్ని అనుసరిస్తారు



దళిత కవి దున్న ఇద్దాసుకు నివాళులర్పిస్తున్న దృశ్యం

చిక్కడపల్లి: భక్తి పరిపూర్ణమైతేనే జ్ఞానమార్గాన్ని అనుసరిస్తారని పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా పేర్కొన్నారు. ఆదివారం త్యాగరాయ గానసభ నిర్వహణలో తొలితరం దళిత కవి దున్న ఇద్దాసు యాదిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. అట్టడుగు వర్గాల్లో చైతన్యానికి బాటలు వేసిన మహనీయుడని కొనియాడారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో ప్రముఖులు స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు, బీజేపీ సింద్రాబాద్ పార్లమెంట్ జాయింట్ కన్వీనర్, బీజేవైఎం నగర మాజీ అధ్యక్షులు ఎ. వినయ్‌కుమార్‌నేత, ప్రముఖ గాయకుడు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కాలేరు కాంగ్రెస్‌లోకి వస్తే స్వాగతిస్తాం



సమావేశంలో మాట్లాడుతున్న టీపీసీసీ కార్యదర్శి యాదగిరి గౌడ్ లకపతి

నల్లకుంట: బీఆర్ఎస్ అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ కాంగ్రెస్ పార్టీలోకి వస్తే స్వాగతిస్తామని టీపీసీసీ కార్యదర్శి లక్‌పతి యాదగిరి గౌడ్ అన్నారు. ఆదివారం నల్లకుంటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో టీపీసీసీ ఓబీసీ సెల్ వైస్ చైర్మన్ కట్టెల సుభాష్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎస్.హరినాథ్ రెడ్డిలతో కలిసి యాదగిరి గౌడ్ మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీ మునిగిపోతున్న నావ వంటిదని, ఆ పార్టీకి రాష్ట్రంలో మనుగడ లేదన్నారు. అందు కోసమే నియోజక వర్గం అభివృద్ధి కోసం ఎమ్మెల్యే కాలేరు కాంగ్రెస్‌లో చేరితే అక్కున చేర్చుకుంటామని పేర్కొన్నారు. కాలేరుకు కాంగ్రెస్ రాజకీయ జీవితాన్నిచ్చిందని, మాతృ పార్టీలో ఆయన చేరితే తామంతా అండగా నిలుస్తామని చెప్పారు.

దేవాలయ అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్యే తలసానితో దేవాలయ కమిటీ ప్రతినిధులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

పద్మారావునగర్ : సాయిబాబా దేవాలయం అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో ముందుకు సాగుతూ చిత్తశుద్ధితో పనిచేయాలని ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. బోయిగూడ బ్రిడ్జి సమీపంలోని సుప్రసిద్ధమైన సాయిబాబా దేవాలయం నూతన కమిటీ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేవాలయానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని రకాల సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. కమిటీ ప్రతినిధులు తమ పనితీరుతో దేవాలయం పేరు ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని కోరారు. బాబా ఆలయానికి ఎంతో పేరుందని దీన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలన్నారు. ఆలయ కమిటీ అధ్యక్షులు బి. మహేష్‌ను ఎమ్మెల్యే తలసాని సత్కరించి అభినందించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు లక్ష్మీనారాయణ, కరుణాకర్, సాయిక్రిష్ణ, భగత్ శ్రీను, శంకర్, ఎస్. రాజేందర్, సురేష్, జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

మాలలపై అసత్య ప్రచారం మానుకోవాలి

తెలంగాణ మాలమహానాడు ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్



హిమాయత్‌నగర్: తెలంగాణలో మాలలపై ఎమ్మార్పీఎస్, మాదిగ సంఘాలు చేస్తున్న విష ప్రచారం మానుకోవాలని మాల మహానాడు తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ ప్రశాంత్ సూచించారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ... మాలలు కన్నా మాదిగ కుల జనాభా ఎక్కువ అంటూ అసత్య ప్రచారం చేస్తున్నారని దీనిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మాల, మాల ఉప కులాలు ఎస్సీ జాబితాలో సుమారు 23 మాల ఉప కులాలు ఉన్నాయని.. జనాభా రీత్యా మాదిగల కన్నా మాల కులాలే తెలంగాణలో అత్యధిక జనాభాగా ఉన్నారని గుర్తు చేశారు. ఈ రాజకీయ పార్టీల నాటకీయ కుట్రలు పట్ల మాల జాతి అప్రమత్తంగా ఉండాలని ప్రవీణ్ పిలుపు ఇచ్చారు. రానున్న లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో వర్గీకరణకు అనుకూలంగా ఉన్న పార్టీలను ఓడించాలని, ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా బలమైన గళం వినిపిస్తూ.. దేశంలో దళితుల ఐక్యత కోసం దళిత బహుజన పార్టీ అభ్యర్థులకు మాలమహానాడు మద్దతు ఇవ్వాలని నిర్ణయించినట్లు ప్రశాంత్ ప్రకటించారు.

చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు



హెబ్రోన్ చర్చి వద్ద ర్యాలీ..

చిక్కడపల్లి: ఈస్టర్‌ను పురస్కరంచుకొని ఆదివారం నియోజవర్గంలోని క్రైస్తవ ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలను ఘనంగా నిర్వహించారు.చర్చిల్లో పాస్టర్లు బైబిల్‌లోని వాక్యాలను బోధించడంతోపాటు ఈస్టర్ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం చర్చి సమీపంలోని పురవీధుల్లో క్రీస్తు సువార్త ర్యాలీని నిర్వహించారు. హెబ్రోను దైవసేవకులు బ్రదర్ ఎస్.జయరాజు, ప్రాన్సిస్లు ఈస్టర్ సందేశాన్ని వినిపించారు.

కాంగ్రెస్‌లో చేరిక



మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరుతున్న రమణారావు తదితరులు

నల్లకుంట: కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యమని తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి(టీబీఎస్ఎస్) అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు అన్నారు. ఆదివారం రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు సమక్షంలో ఆయన దేవులపల్లి రంగారావు, ప్రసాద్ తదితరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీళ్లందరికి పార్టీ కండువాలు కప్పిన శ్రీధర్ బాబు పార్టీలోకి ఆహ్వానించారు.

3 నుంచి ఓయూలో సాంస్కృతిక పోటీలు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అంతర్ కళాశాలల సాంస్కృతిక పోటీలను ఏప్రిల్ 3, 4 తేదీల్లో నిర్వహించనున్నారు. యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఠాగూర్ ఆడిటోరియంలో రెండ్రోజుల పాటు జరిగే సాంస్కృతిక పోటీల్లో క్యాంపస్ కాలేజీలతో పాటు అనుబంధ, ప్రైవేటు కాలేజీల విద్యార్థులు హాజరుకానున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను వెలికితీసేందుకు ప్రతిఏటా సాంస్కృతిక పోటీలను నిర్వహిస్తున్నట్లు అధికారులు ప్రకటించారు.

అబోడ్ బయోటెక్‌తో ఓయూ ఒప్పందం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అబోడ్ బయోటెక్‌తో ఒప్పందం కుదర్చుకున్నాయి. వీసీ ప్రొ.రవీందర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అబోడ్ బయోటిక్ ప్రతినిధులు ఎం.శ్రీనాథ్, షాలిని ఒప్పందపత్రాలపై సంతకాలు చేసి పరస్పరం మార్పిడి చేసుకున్నారు. ఒప్పందం ప్రకారం సంయుక్త పరిశోధనలు, అధ్యాపకుల మార్పిడి, విద్యార్థులకు ఇంటన్‌షిప్, శిక్షణ, మౌలిక సదుపాయాల వినియోగం ఇతర అంశాలపై సహకారం కోసం సంతకాలు చేశారు.

'ఎన్నికల్లో రెండు తెలుగు రాష్ట్రాల్లో పోటీ చేస్తాం'

లిబర్టీ: రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికల్లో పోటీ చేస్తామని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు కె.బి.శ్రీధర్ వెల్లడించారు. భావ సారూప్యతతో పాటు కలిసి వచ్చే లౌకిక పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని స్పష్టం చేశారు. లిబర్టీ ప్లాజాలోని పార్టీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లోక్‌సభ, శాసన సభ ఎన్నికల్లో బరిలో నిలుస్తామని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని 17 లోక్‌సభ స్థానాల్లో కచ్చితంగా పోటీ చేసి తీరుతామని స్పష్టం చేశారు. తెలంగాణలోని అన్ని లోక్‌సభ స్థానాల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తు పెట్టుకుంటామని అవసరమైతే కొన్ని స్థానాల్లో ఒంటరిగా బరిలోకి దిగుతామన్నారు. అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ కొనసాగుతుందని త్వరలోనే స్క్రీనింగ్ కమిటీ సమావేశమై అభ్యర్థుల ఎంపిక ఖరారు చేస్తామని అన్నారు. దీంతోపాటు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని 175 అసెంబ్లీ, 25 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేయాలని యోచిస్తున్నట్లు పేర్కొన్నారు. అక్కడ రాజకీయ పరిణామాలపై లోతుగా చర్చించిన తరువాతే ఏఏ పార్టీలతో పొత్తు పెట్టుకోవాలని ఒంటరిగా పోటీ చేయాలా అనే అంశాన్ని పార్టీలో చర్చించి తుది నిర్ణయం తీసుకుంటామని శ్రీధర్ స్పష్టం చేశారు.

కుమార్తెను హింసిస్తున్నారంటూ తండ్రి ఫిర్యాదు

వెంగళరావునగర్: నగలు, నగదు తీసుకోవడమే కాకుండా భార్యతో కలిసి బంధువులు తనను, మైనర్ కుమార్తెను వేధిస్తున్నారంటూ ఓ తండ్రి మధురానగర్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసుల సమాచారం మేరకు... ఫతేదర్వాజాకు చెందిన ఖదీర్ మహ్మద్ వ్యాపారం చేస్తుంటాడు. 2019 జూన్ 28న స్థానికంగా ఉన్న ఓ మహిళతో మహిళతో వివాహం జరిగింది. వారికి నాలుగేళ్ల పాప కూడా ఉంది. తన భార్య తనకు తెలియకుండా రూ. 3 లక్షలు, బంగారం ఆమె తండ్రి (డ్రైవర్)కు ఇచ్చింది. ఎన్నోసార్లు వాటిని తిరిగి ఇవ్వాలని అడిగినా ఇవ్వలేదు. తన భార్యను తప్పుదారి పట్టించడమే కాకుండా గొడవలకు దిగుతున్నాడు. బంధువులు సైతం భార్యకు తనకు మధ్య మనస్పర్ధలు సృష్టించి కాలాపత్తర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయించారు. తన కుమార్తెను తీసుకెళ్లి బంధువులు ఇష్టానుసారంగా హింసిస్తున్నారు. తన షాపునకు వచ్చి భయబ్రాంతులకు గురిచేసి చంపేస్తామని బెదిరిస్తున్నారు. ఆమె తల్లిదండ్రులు దుర్వ్యసనాలకు బానిసై భార్యను కూడా తప్పుదారి పట్టిస్తున్నారు. తనకు విడాకులు ఇప్పించి అమెరికాలో ఉంటున్న వ్యక్తితో వివాహం జరిపించాలని ఆమె తల్లిదండ్రులు వేధిస్తున్నారు. ఈ విషయాన్ని ఇప్పటికే డీసీపీకి కూడా ఫిర్యాదు చేసినట్టు బాధితుడు పేర్కొన్నాడు. కోర్టు ఆదేశాల మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన నృత్య ప్రదర్శన



ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో ఆదివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. సంగీత నాటక అకాడమి అవార్డీ నాట్య గురువు మద్దాలి ఉషాగాయిత్రి శిష్యబృందం నిర్వహించిన అన్నమయ్య అమృత ధార, కూచిపూడి, నృత్య ప్రదర్శనలు అలరించాయి. వీటితోపాటు అన్నమయ్య సంకీర్తనలను వాసవి, నీరజ, లక్ష్మీశ్రీ, సుప్రియ, శ్రద్ధ, తన్మయ, వైష్ణవి, దీపికా, సహస్రలు ప్రదర్శించి మెప్పించారు.